## క్లుప్తంగా

### హైదరాబాద్‌కు స్టార్ లైనర్ సర్వీస్

వెంకటగిరి: పట్టణం నుంచి ఆదివారం స్టార్‌లైనర్ (నాన్ ఏసీ స్లీపర్) ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ ఏ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

### చెరువు తూము పనులు ప్రారంభం



పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

గూడూరురూరల్: మండలంలోని వెడిచెర్ల గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ కింద ఐసీఐసీఐ బ్యాంక్ నిధులతో చెరువు తూము పునర్నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఫౌండేషన్ కమ్యూనిటీ ఫెసిలిటేటర్లు మస్తానమ్మ, గోపాల్, సర్పంచ్ పెంచలయ్య, ఏఈ సురేష్‌బాబు పాల్గొన్నారు.

### కీచక టీచర్లను శిక్షించాలి

వెంకటగిరి: విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణలను కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కే అజిత డిమాండ్ చేశారు. ఆ పాఠశాల వద్ద శుక్రవారం ఆ యూనియన్ అధ్వర్యంలో ధర్నా చేశారు.

### సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న సహచరులు

చిల్లకూరు: మండలంలోని వల్లిపేడు జెడ్పీ హైస్కూలు నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు, ఇక్కడికి వచ్చిన టీచర్లను విద్యార్థులు శుక్రవారం సత్కరించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. టీచర్ శ్రావణకుమార్, సీఆర్పీ రమణయ్య, పీడీలు విజయ, అరుణ పాల్గొన్నారు.

### విజిలెన్స్ తనిఖీలు

గూడూరు: మున్సిపాలిటీలో పలు వివరాల నిమిత్తం నెల్లూరు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగం ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ల మంజూరుకు సంబంధించి, గత ఆరు నెలల వివరాలను అందజేతలో జాప్యం కారణంగా, రికార్డులు పరిశీలించి, ఆ వివరాలను తీసుకున్నామన్నారు.

### కలెక్టర్, ఎస్పీ పరామర్శ



పరామర్శిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రాపూరు: సైదాపురం పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన జోరేపల్లి అక్కమాంబపురానికి చెందిన వంగపాటి ఆకాష్ కుటుంబాన్ని నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని బెనిఫిట్లను అందిస్తామన్నారు. వారి వెంట అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, డీఎస్పీ కోటిరెడ్డి, సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఉన్నారు.

### తక్కువ ఖర్చుతో అధిక పాడి

గూడూరు: పశుగ్రాసం వాడకంతో దాణా వ్యయాన్ని తగ్గించుకోవడమేకాకుండా అధిక పాల దిగుబడి పొందవచ్చని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. సాధూపేట కూడలిలోని పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ కార్యాలయంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాడి రైతులకు పశుగ్రాసాల్లోని రకాలు, వాటి వినియోగం ద్వారా దాణా ఖర్చును ఏ విధంగా తగ్గించుకోవచ్చనే అంశాలపై అవగాహన కల్పించారు.



సైదాపురం మండలం తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన పోట్లేశ్వ రాములమ్మకు జాబ్‌కార్డు లేదు. దీంతో ఆమె ఉపాధి పనులకు పోలేకపోయేది. ఆమె జాబ్ కార్డు కోసం అర్జీ ఇచ్చింది. ఆమె ఇచ్చిన అర్జీని పంచాయతీ కార్యదర్శి ఇంద్రాణి, డిజిటల్ అసిస్టెంట్ నాగమణి పరిశీలించారు. రాములమ్మకు కేవలం రెండు గంటల్లోనే జాబ్‌కార్డు జారీ చేశారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది.



ఎక్కలూరు గురులక్ష్మిది సైదాపురం మండలం కలిచేడు గ్రామం. రేషన్‌కార్డు కోసం గతంలో ఎన్నోసార్లు తహసీల్దార్, మీ-సేవా చుట్టూ తిరిగింది. అయినా ప్రయోజనం లేకపోయింది. ఆమె సెప్టెంబరు 23వ తేదీన కలిచేడు సచివాలయానికి వెళ్లి వలంటీర్ ధనలక్ష్మి సహకారంతో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది కలిసి ఆమె వివరాలు పరిశీలించి రేషన్‌కార్డు మంజూరు చేశారు.

# సచివాలయం.. గ్రామస్వరాజ్యం సాకారం

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. పడిగాపులు.. దళారీలు మధ్యవర్తులకు చెక్.. అవినీతి రహిత పారదర్శక పాలన.. ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు.. వెరసి గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సాకారం. ఇదీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన. ఫలితంగా పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి.

- పల్లె ముంగిటకు ప్రభుత్వ యంత్రాంగం
- మండల కేంద్రం చుట్టూ తిరిగే కష్టాలకు తెర




గ్రామ సచివాలయం

సైదాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం ఇబ్బందులు తొలగించేందుకు ప్రారంభించిన సచివాలయాలు పౌరసేవలకు చిరునామాగా నిలుస్తున్నాయి. మండలంలోని 19 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 145 మంది ఉద్యోగులు, 275 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. వీటి ద్వారా మొత్తం 536 సేవలు ప్రజలకు అందుతున్నాయి.

**ప్రజల వద్దకే సేవలు..**

సచివాలయాల్లో ప్రధానంగా ఇంటి పట్టా, రేషన్ కార్డు, మ్యుటేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్‌బీ, అండగల్, పింఛన్ దరఖాస్తు, సదరమ్, ఆధార్, ఆరోగ్య శ్రీకార్డు, విద్యుత్ సేవలు అందుతున్నాయి. ప్రస్తుత పాలనలో ఒక్క రోజులోనే వందల సంఖ్యలో అర్హులకు రేషన్‌కార్డులు ఇచ్చింది. సచివాలయాల్లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో వలంటీర్ల ద్వారా కార్డులు ఇంటికి చేరుస్తున్నారు. అలాగే ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నారు. పింఛన్ కూడా నిర్ణీత గడువులోపు మంజూరయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీంతో కార్యాలయాల్లో ప్రజలు క్యూకట్టాల్సిన అవసరం తప్పింది.

**గతంలో అర్హత ఉన్నా పథకాలకు దూరం..**

టీడీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లు. అది కూడా రెండేళ్లకోసారి కార్డులు ఇచ్చేవారు. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. అలాగే ప్రజలు వారికి అవసరమయ్యే వివిధ రకాల ధ్రువపత్రాలు పొందాలంటే గగనమయ్యేది. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత ధృవపత్రాలు పొందాలంటే మండల కేంద్రాల్లోని మీ-సేవా కేంద్రాలతో దరఖాస్తు చేసేవారు. ఈ దరఖాస్తు సంబంధిత కార్యాలయాలకు వెళ్లి అక్కడ ప్రభుత్వ అధికారులతో ధ్రువీకరించుకునేవారు. ఆ తర్వాత మళ్లీ మీ-సేవా కేంద్రాలకు వచ్చి ధ్రువీకరణ పత్రాలను పొందేవారు. అయితే దీనికి చాల సమయం పట్టేది. దీనికి తోడు టీడీపీ నాయకుల సిఫార్సు ఉన్న వారికి అన్నీ రకాల సేవలు అందడంతో పాటు లంచగొండితనం కూడా విపరీతంగా ఉండేది. దీంతో ప్రజలు ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా పొందలేని పరిస్థితి. నేడు ఆ పరిస్థితి నుంచి ముంగిటే సేవలు అందే స్థితి వచ్చింది.

**సమస్యలకు సత్వరమే పరిష్కారం**



ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారమయ్యేవి కాదు. నేడు స్థానికంగా సచివాలయంలోనే వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో ఉండడంతో సత్వరమే న్యాయం జరుగుతుంది.

–రాజశేఖర్‌నాయుడు, రామసాగరం

**గ్రామంలోనే ప్రభుత్వ సేవలు**



సచివాలయాల ఏర్పాటుతో అన్ని రకాల ప్రభుత్వ సేవలు త్వరితగతిన గ్రామంలోనే లభిస్తున్నాయి. గతంలో మండల కేంద్రానికి వ్యవప్రయాసలకోర్చి వెళ్లినా ఆరోజు పని అయ్యేది కాదు. ఇప్పుడు సచివాలయంలోనే అన్ని పనులు అవుతున్నాయి.

–గుంటమడుగు గీతాంజలి, అనంతమడుగు

# ప్రతి గడపకు సంక్షేమం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: నిరుపేదలను దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మండలంలోని కొరిడి సచివాలయంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు కలిసి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా అన్న విషయంపై ఆరా తీశారు. అనంతరం జలజీవన్ సురక్ష తాగునీటి పథకం, కొరిడి పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కోసమే అనేక సంక్షేమ పథకాలును సీఎం తీసుకొచ్చారని చెప్పారు. గ్రామాల్లో టీడీపీ నేతలు తమ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జే వేణు, సీ యుగంధర్, సర్పంచ్ కే గురువయ్య, ఎంపీడీఓ ప్రమీలారాణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సుధీర్ పాల్గొన్నారు.

# సీఎం జగన్‌కు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం





వెంకటగిరి: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సైదాపురంలో..

వెంకటగిరి: రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన సాగిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతిజిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 9వ వార్డు ఉపాధ్యాయనగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు, చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కే కల్యాణి, ఏఎం నారాయణ, ఎస్‌కే వహీదాయస్థానీ, ఎం జానకిరామయ్య, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం తిరుపతిజిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, నేతలు కే బ్రహ్మయ్య, కే రాజారెడ్డి, రాఘవరెడ్డి, యస్థానీబాషా, వీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

**షేఫ్టీ జాకెట్ల పంపిణీ**

వెంకటగిరి మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఆర్యవైశ్యం సంఘం అధ్వర్యంలో షేఫ్టీ రేడియం జాకెట్లను శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు డీ రాధమ్మ, ఆర్యవైశ్యం సంఘం నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

**సంక్షేమంతో సంతోషం**

సైదాపురం: సంక్షేమ పథకాల అమలుతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సైదాపురం సచివాలయం-1లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వారు పొందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు శంకర్‌రాజు, ఆదిశేషయ్యనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, సర్పంచ్ శారద, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, నేతలు వీ ప్రభాకర్‌రెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, శివ, సుధీర్, సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ పోరంబోకు ఆక్రమణ



జామాయిల్ చెట్లను తొలిగించి, చదును చేసిన పోరంబోకు భూమి

దొరవారిసత్రం: కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 6లో ఉన్న అటవీ పోరంబోకు భూమి ఆక్రమణలకు గురైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ తంతు కొంత కాలంగా జరుగుతున్న స్థానికులు తెలిపారు. ఇప్పటికే పదుల ఎకరాల భూమి ఆక్రమణలకు గురైంది. ఆక్రమణలను రెవెన్యూ అధికారులు పలుసార్లు అడ్డుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. సర్వే నంబరులో 6లో అటవీ అధికారులు సాగు చేసి జామాయిల్ తోటను సైతం కొందరు రాత్రి రాత్రికి యంత్రాలు పెట్టి సాగు భూమిగా తీర్చారు. ఈ విషయమై కొత్తపల్లె వీఆర్వో యుగంధర్ ను వివరణ కోరగా కొత్తపల్లి సర్వే నంబర్ 6లోని అటవీ పోరంబోకు భూమి ఆక్రమణకు గురవుతున్న విషయం తెలుసుకుని పలుమార్లు అడ్డుకున్నామన్నారు. ఇలాగా కొనసాగితే క్రిమినల్ చర్యలు తీసుకోకతప్పదని హెచ్చరించారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు: ఒకటి, రెండు పట్టణాలతోపాటు రూరల్ మండలంలోనూ విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఎస్పీడీసీఎల్ డీఈ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**వెంకటగిరిలో..**

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం సెంటర్ 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

**సూళ్లూరుపేటలో..**

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నేముత్తేరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ సురేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని రెండోటౌన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ సమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని సంతదాసుపల్లెలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ సిసింద్రీ, పీ మస్తానయ్య, ఎంఎంఎస్ జిల్లా కన్వీనర్ ఎం విజయలక్ష్మి, ఎంఎస్పీ మహిళా విభాగం కన్వీనర్ సీ మనీషా, ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి పాల్గొన్నారు.

### చిరుధాన్యాల సాగుపై శిక్షణ



మాట్లాడుతున్న భాస్కరయ్య

వెంకటగిరిరూరల్: మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి రైతులకు చిరుధాన్యాల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు భాస్కరయ్య మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై మెలకువలు, అవశ్యకతపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం రైతులకు రాగి విత్తనాలను పంపిణీ చేశారు. శాస్త్రవేత్త గోవిందరాజు, ఏడీఏ నాగార్జునసాగర్ తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

గూడూరు: దుకాణాలు, సంస్థల్లో బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం బాల కార్మికులకు కనీస వేతనం నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జూన్ నెలలో చేసిన తనిఖీల్లో బాల కార్మికులు పనిచేస్తున్న దుకాణాలు, సంస్థలపై కనీస వేతన చట్టం కింద, గూడూరు ఆథార్టీ కోర్టులో దాఖలైన 34 కేసులను విచారించి 26 కేసులను పరిష్కరించామన్నారు. అపరాధ రుసుముతో కలిపి రూ 1,22,781 నగదు బాల కార్మికులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వై సత్యనారాయణ పాల్గొన్నారు.

### రూ.లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి స్థానికులు మాదరపాక జయరామ్ అండ్ సన్స్ రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఆ నగదుకు సంబంధించిన చెక్కును శుక్రవారం ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి వారు అందజేశారు. పాలకమండలి సభ్యులు కర్లపూడి సురేష్ బాబు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గూడూరు: రైలు నుంచి అదుపుతప్పి పడిపోయిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి ధానాపూర్ వెళ్లే రైలు డోరు వద్ద నిల్చుని ఉన్న సుమారు 35 వయస్సు కలిగిన వ్యక్తి అదుపు తప్పి జారిపడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన అతన్ని ఏరియా ఆ స్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు రెడ్ షర్టు, పాచికలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. అతనికి సంబంధించిన ఎలాంటి వివరాలు లేవని రైల్వేపోలీసులు తెలిపారు.

### డివైడర్‌ను ఢీ కొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు ముందుభాగం

చిల్లకూరు: మండలంలోని కోట క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం ఓ కారు అదుపుతప్పి డివైడర్ ఢీ కొంది. దీంతో కారు ముందు టైర్ పంచర్ అయ్యింది. ఈ క్రమంలో కారును నడుపుతున్న వ్యక్తి చాకచక్యంగా వ్యవహరించడంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. కోట మండలం విద్యానగర్‌కు చెందిన విజయులరెడ్డి సొంత పనుల నిమిత్తం నెల్లూరుకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి బయలు దేరాడు. ఈ క్రమంలో కారు కోట క్రాస్ రోడ్డు వద్దకు వచ్చే సరికే అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. దీంతో కారు ముందు టైర్ పంచర్ కావడంతో విజయులురెడ్డి చాకచక్యంగా కారును అదుపు చేయడంతో రోడ్డు పక్కనే ఉన్న రైలింగ్ వద్ద నిలిచి పోయింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

### స్వశక్తితో అభివృద్ధి చెందాలి

నాయుడుపేటటౌన్: పొదుపు మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని ఎంపీఎం ప్రసన్నకుమారి, డీఆర్పీ చంద్రబాబు సూచించారు. నాయుడుపేట మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం పొదుపు మహిళలకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై అవగాహన పెంచుకుని, వాటిని స్థాపించుకోవాలన్నారు. తద్వారా మంచి ఆదాయం పొందవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శారద, మత్స్యశాఖ అధికారి పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్ పంటలతో ఆదాయం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ మునిరత్నం

చిల్లకూరు: రైతులు తాము సాగు చేస్తున్న దీర్ఘకాలిక పంటల నడుమ అంతర్ పంటలను ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా మేనేజర్ మునిరత్నం తెలిపారు. మండలంలోని బూదనం గ్రామంలో శుక్రవారం పిల్లెల చంద్రశేఖర్ అనే రైతు సాగు చేస్తున్న నిమ్మ పంటలో అంతర్ పంటలను ప్రోత్సహించే క్రమంలో ఆ రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, తిరుపతి ప్రకృతి వ్యవసాయం జిల్లా టెక్నికల్ అధికారి హరిచంద్రప్రసాద్, ఎంటీ తిరుమల, మోడల్ మేకర్ శ్రీనివాసులు, ఎల్-1 కృష్ణయ్య, పద్మమ్మ, సుహర్లత, ఎల్-2 ధనుంజయ్, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సురక్ష.. అర్హులందరికీ రక్ష

సూళ్లూరుపేట రూరల్: రాష్ట్రంలో అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమం అర్హులందరికీ రక్ష అని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శుక్రవారం కోటపోలూరు -2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జే వేణు, ఏ రమేష్ రెడ్డి, బీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల వద్దకే 11 రకాల సేవలు**

కోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ప్రజల ముంగిటనే అందజేస్తున్నామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. చెందోడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, 394 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మొబీన్‌బాషా, సర్పంచ్ దేవారెడ్డి మాధవి, నాగూర్‌రెడ్డి, సీ సాయిప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, జయచంద్రారెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు.

**జగనన్నకు అండగా నిలవాలి**

నాయుడుపేటటౌన్: పేదల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అన్ని వర్గాల ప్రజల అండగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక కోరారు. నాయుడుపేట మున్సిపాలిటీ భూపయ్య కాలనీ, గిండివారితోటలో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజేంద్ర, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, కే మాధవరెడ్డి బీ మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, జీసీఎస్ అర్బన్ కన్వీనర్ సీ కుమార్, కే చెంచయ్య, డీ రవి, పీ నాగార్జున, షబ్బీర్ పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఓజిలి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు అన్నారు. మండలంలోని ఇనుగుంటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, సర్పంచ్ కే విజయమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్ సంధ్యారాణి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పీ వేణురెడ్డి, నాయకులు డీ మధుసూదన్‌రెడ్డి, కుమార్‌నాయుడు, సురేష్, మురళి, నాగరాజు పాల్గొన్నారు.

**ఇంటివద్దకే సర్టిఫికెట్లు**

గూడూరురూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు వారి ఇళ్ల వద్దకే అవసరమైన సర్టిఫికెట్లు అందుతున్నాయని ఎంపీపీ గురవయ్య అన్నారు. మండలంలోని రామలింగాపురం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యామిని, డీఎల్‌డీఓ వాణి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సంపూర్ణమ్మ, పెంచలయ్య పాల్గొన్నారు.

**సంక్షేమానికి సంపూర్ణ భరోసా**

వాకాడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంక్షేమానికి సంపూర్ణ భరోసా దొరుకుతుందని వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కే దామోదర్‌రెడ్డి అన్నారు. కల్లూరులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, సర్పంచ్ డీ భాస్కర్‌రెడ్డి, నాయకులు పీ కోటేశ్వరరావు, మధురెడ్డి, రవీంద్ర, భాస్కర్‌పాల్గొన్నారు.

**చరిత్రాత్మకం**

డక్కిలి: జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రాత్మకమని జేసీఎస్ మండల కన్వీనర్ సీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ గోను రాజశేఖర్ అన్నారు. మండలంలోని లింగసముద్రం, దగ్గవోలు సచివాలయాల్లో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**సత్వర సేవలకే సురక్ష**

వెంకటగిరిరూరల్: పేదలకు సత్వర సేవలు అందించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి తెలిపారు. మండలంలోని యాతలూరులో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచలమ్మ, చిన్నగురవయ్య, వైస్ ఎంపీపీ పెంచలయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగయ్య పాల్గొన్నారు.



సూళ్లూరుపేటరూరల్: సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య,



కోట: చెందోడులో ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



నాయుడుపేటలో.. చైర్ పర్సన్ దీపిక




వెంకటగిరిరూరల్: యాతలూరులో.. ఎంపీపీ తనుజారెడ్డి